'పంచాది"

పుప్పల నరసింహం

గది పంచాతాఫీసు - దాని పక్కకు 'పీర్లకొట్ట' ముంది – 'పీర్లకొట్టం'లపీర్లున్నయ్ –పంచాదాఫీసుల మనుషులుంట్రు. పీర్లకు రంగు రంగుల 'దట్టి' లున్నయ్. పీర్లనెత్తిమీద దగ దగ మెరిశె 'పంజ' వుంది – గా మనుషుల నెత్తిమీదనెమో నున్నగ యెంటికలున్నయ్ నల్లగ – జెరిపోతు సార్కలున్నట్టుగ.

పీర్ల మెడలో యెండిపోయిన పువ్వులున్నయ్ – గవి నల్లగయినయి. గక్కడ కూసున్న ఒకరిద్దరి పెద్దమనుషుల మెడలళ్ళగూడ రుద్రాచ్చమాలలున్నయ్ - గవి గూడ నల్లగనే వున్నయ్, నళం రంగుల–యిగ పీర్లకు కాళ్ళు, శేతులు సరికేశినట్టు మొండి గున్నయ్. రెండు కాళ్ళు పోయ్న కుంటోడు గద్దెమీద గూసున్నట్టున్నయ్ గాపీర్లు – గని గా మనుషులకైతే కాళ్ళు, శేతులు దొడ్డుగ బందపస్తుగున్నయ్ – గంతేగాక పీర్లకు పాణంలేదు – గక్కడున్న మనుషులకైతే పాణమున్నది, దమాకున్నది -- ఎల్లిని మల్లి, మల్లిని ఎల్లిజేస్తరు -- కిందబెడ్తె మీదబెడ్తర్, మీదబెడ్తె కిందబెడ్తర్–కిందబడ్డా, మీదబడ్డా 'బంచోత్' అంటర్ ఆళ్ళు-

గా మనుషులు ఊరికి ఒక మూలగున్న గా పంచాదాఫీసు చిడీళ్ళ మీద కూసోని సుట్టలు, శిగిలేట్లు పీల్సుతుంట్రు – నల్లగ దొడ్డుకు దొడ్డున్న పెద్ద మనిషొకాయన బంగారి రంగు కండ్లద్దాలు కిందికి మీదికి ఆనుకుంట, కండ్లు మిటకరిస్తూ కాయిదాలు సదువుతుండు – గాయన పేరే యెంకట్రామిరెడ్డి పటేల్. గాయనే ఊరికి పెద్ద -- పంచాదులను, కొట్లాటలను ఊరుదాటి పోనియ్యకుంట తశ్వజేస్తడు- ఊరును 'కదర్' మీద ఉంచాలని శానశాన జేస్తడు–

ఊర్లె పెద్దమనుషులంత గాయన మాటింటరు – ముసలోళ్ళు ఎన్కటి కాలమోళ్ళు ఆయ్నకు వొంగొంగి దండాలు బెట్టి మర్యాదిస్తరు -- సేట్లు, సావుకార్లు, కాపులు, ఆసాములు, అప్పులిచ్చేటోళ్ళు ఆయ్న ఎట్ల జెప్తె గట్లనడుస్తరు – గాయన మాటకు ఎదుర్ లేదు – ఎవడు పల్లెత్తి జవాబియ్యడు ఆయ్న ముంగల – గిట్లజేశె ఊర్ని శాన ఖబడ్దార్ల వుంచుకుండు –

గా వూర్లెనే గాక ఆ సుట్టుపట్ల ఊర్లళ్ళ గూడ పేరెల్లినోడు యెంకట్రామిరెడ్డి పటేలు – పంచాదులు, కొట్లాటలు తెంపనీకి శాన దూరం, దూరం బోయొస్తడు – గా పటేల్ అంటే శాన మందికి అదర్ – ఆయ్నను జూస్తెనే అంత దూరంకెల్లి మర్లి పోతరు – శెప్పులు శేతుల వట్టుకుని ఒక్కొక్కరు వేరే తొవ్వెంట బోతరు.

గా యెంకట్రామిరెడ్డి పటేల్‌కు ఊరు శివార్లవున్న భూమంత ఆయనదే – పొరుగూర్లలో గూడ భూముండి–కంచె (చిట్టడివి) నే రెండొందలెకరాలుంది. యింక బావులు బందములు గాక – ఊర్లెవున్న రాములవారి గుడికిందవున్న అరువై యెక

రాల భూమి కొడుకు సీతారామిరెడ్డి పేర రాయించిండంటరు - ఎన్కటి పెద్ద మనుషులకు పైస మిత్తీలకిస్తడు – కంచె పుల్లెర కిస్తడు. ఇంతశెట్ల అర్రాసువెట్టి వొచ్చిన పైసలు ఆయన్నే దీసుకుంటడు – గిట్లజేశి, గట్లజేశే రెండంత్రాల బంగ్ల గట్టిండని అంటరు–

ఇగ వొయుసొయుసు పోరగాళ్ళు–దుడ్డెకు దుడ్డె వున్నోళ్ళు గాల్లు గిల్లు పోరలు పొట్టెగాండ్లు యెంకట్రామిరెడ్డి పటేల్‌ను 'కేర్' జెయ్యరు–జెర్రి గోడ సాటైతేసాలు తిడ్తనే వుంటరు. "కందిరీగ మోగమోడ"ని కొంత మంది 'కత్తర్ నాక్ సాలెగాడు' అని "మందినిముంచి పెద్దగైండ"ని "మంది సొమ్ముల అపా లిచ్చుకున్నడ"ని "మిత్తీలకిచ్చి పెద్దగయిండ"ని "రజాకార్ల వక్తల బంగారం దెంగిపోయిండ"ని "మంది పొలాలు కబ్జ జేసిండ"ని తలా ఒక తీరు తిడ్తరు–

యెంకట్రామిరెడ్డి పటేల్ ఊర్లెవున్న పోరగాళ్ళు తన చేతులలేరని ఎప్పుడో తెల్సుకుండు. యెప్పుడైతే తననికాదని ఊర్లె రైతుల "సంఘం" బెట్టింద్రో గప్పుడే బాగా దెల్సిపోయింది. పోరగాళ్ళు శెడిపోయింద్రని–

'సంఘం' బెట్టిన పోరగాండ్లను ఏమనలేక ఆ పోరల తల్లిదండ్రులను పిలిపిచ్చి జెర దటాయించినట్టు నాలుగు దిట్టిపంపిస్తడు. ఇగ తన శేతుల జిక్కినప్పుడో నల్లిని నలిపినట్టు నలుస్తడు. అప్పసప్పకు బోతే పుట్టనీయడు. ఇంత 'తుకం' అంటే, ఇంత 'ఎరువు' అంటే పుట్టనీయడు. గందుకే ముసలోళ్ళు యెంకట్రామిరెడ్డి పటేలుకు యెదురు జెప్పరు. అయ్య పాదాలకు దండంబెట్టి ఎట్లజెప్తెఅట్లింటరు.

ఇక పటేలు సంగతి గిట్లుంటే గా ఊరి కరణం పంతులు మూతునాకులోడు– పనిపాటలోళ్ళకు, ఆళ్ళకు ఈళ్ళకు తాకులాటవెట్టి తమాష జూస్తడు. నాల్‌ముచ్చి తెక్కల్ ఎక్కువున్నయ్. వాని దగ్గర పది వీని దగ్గరపది ఆ కుర్మోని దగ్గరగొర్రె ఈ కాపోని దగ్గర కోడి దీసుకుని పూటెల్లగొట్టుకుని సంపాదించిదంత మూలకు బెట్టుండని అంటరు ఊర్లె–

ఊర్లె ఒక్క కోమటోని దగ్గర నూరుతులాల బంగార ముందని, హౌజులు గట్టి హౌజులల్ల పైసల్‌నింపి బెట్టింద్రని ఊర్లే పుకార్– ఇవన్ని మందిని ముంచి దోసుకున్నయేనని ఆడు, ఈడు అంటుంటరు.

ఇగ కాపోల్లుగూడ బలిశె వున్నరు– ఒక్కొక్కనికి బంగ్లలు, మిద్దెలున్నయ్.

ఇగ గీల్లే ఊర్లె పెద్దమనుషులు. ఊర్లె ఎమన్న జరిగితె తశ్వాజేస్తందుకు ఈళ్ళంత గూడుతరు–

యిప్పుడు గూడ పంచాదాఫీసు కాడ గందుకె కూడింద్రు.

యెంకట్రామిరెడ్డి పటేలుకు జెరదూరంగ కరణం పంతులు కూసుండు. జుట్టు ముడేసు కుంటుండు. నోట్లె సోకలున్నట్టున్నయ్ నములుతుండు. మోకాళ్ళ మీద శెల్లవుంది–ఏదో పుస్తకం పక్కకుంది. పెన్ను అంగికి పెట్టుకున్నడు.

కరణం పంతులుకు దగ్గరగ ఆ వూరి ఆసాములు, సావుకార్లు మిగతా పటేండ్లు కూసుండ్రు-

పంచాదాఫీసు ముంగట జెర దూరంగ ఓ కావలోడు కింద కూసుండు-ఏమి జెప్తె అది జెయ్యనీకి తయారుగున్నడు- సూపులన్ని ఆళ్ళమీదనే వున్నయ్-ఎప్పుడు ఏమి అజ్ఞ ఇస్తరో అని శినిగిన బట్టల్తో శేతుల కట్టె వట్టుకొని నెత్తిమీద రూమాళ్ళ సగందాగిన సుట్టబెట్టుకుని 'కుక్క' లెక్క కూసుండు-

గ పంచాదాఫీసు ముంగట పెద్ద పరుపుబండుంది. ఆ బండమీద అరుగుగట్టింద్రు గా అర్గుమీద జండ పాతింద్రు. మీద రంగువోయిన బట్టపేల్క అటు, ఇటు కొట్టు కుంటుంది గాల్కి-గది మూడురంగుల జెండ లెక్కలేనేలేదు. మూలకు పడేశ్న బట్ట పేగు లెక్కనేవుంది-

పంచాదాఫీసు అనుకొనున్న పీర్లకొట్టం ముంగల "హలాలి" ఆడేగుంటుంది—గా గుంటల బూడిదుంది-బూడ్దెల సల్లకుక్క పన్నది. అప్పుడప్పుడు జోరీగలు శెవులమీదికి, కండ్లముంగట్కి వొస్తుంటే శెవులు అటు, ఇటు అడిస్తుందిగని అండ్ల. కెల్లి లేస్తలేదు. గటునుంచి పోయే పందులు యిటొచ్చి సుర్క సూసి పోతున్నయ్

పంచాదాఫీసు గోడకైతే ఏవేవో రాతలున్నయ్- కొన్ని గనిపిస్తున్నయ్. కొన్ని గనిపిస్తలేవు- జెర దగ్గర్కి వోతే జెర, జెర గన్పిస్తున్నయ్- కొన్ని ఎన్నొ ఏండ్లనాడు రాసింద్రు- కొన్ని మొన్న మొన్న రాసింద్రు- మొన్న మొన్న రాశిన యైతే యెర్రగ గనిపిస్తున్నయ్. కొన్ని బొగ్గుతోటి రాశింద్రు పోరగాండ్లు. గవి శెడ్డ శెడ్డమాటలు- మాడ్డి బీడితోని బొమ్మల్ దించింద్రు గోడలకాడి పోరలు.

జెర, జెర కనిపించే రాతలు గిట్లున్నయ్- 'అవుదూడకే మీఓటు'—'బీదల రాజ్యం కావాలంటే కాంగ్రేసుకే మీ ఓటు' "అక్కా నీఓటు ఎవరికే చెల్లే నా ఓటు కాంగ్రేసుకే" గివిగాక "కంకి కొడవలికే మీఓటు" 'కమ్యూనిస్టు అభ్యర్థికే మీఓటు' "సుత్తె కొడవలికే మీఓటు" "జీతాల్ పెర్గాలంటే సుత్తెకొడవలికే మీఓటెయ్యండి."

ఇగ మొన్న మొన్న రాశినట్టుగున్న రాతలు— "దున్నేవాడిదే భూమి" "పోరాడే వానిదే ఎర్రజెండా" "రైతుకూలీల సంఘం వర్ధిల్లాలి"—గట్ల గోడలనిండ రాతలే వున్నయ్. పంచాదాఫీసుకు ఎన్నేండ్లయిందో సున్నమెయ్యక- గందుకనే రాతలన్ని పూర్తిగ నిండిపోయ్నయి. సున్నం పైసల్ గూడ దిగమింగి కూసున్నరని అంటుంటరు.

గటునుంచి కావలిశంద్రయ్య ఉరుకొచ్చినట్టు వొస్తుండు — దమ్మువట్టిండు. పంచాదాఫీసు శేరిండు-కావలిశంద్రయ్య జూసి యెంకట్రామిరెడ్డి పటేల్ మల్ల కాయి దాలు సదువుకుంట "ఏమాయెరా ! అటేపోతివి-దుర్గదొస్తుందా?" అని అడిగిండు—

"లేదు పటేలా—శెరువెన్కకు వోయిండంట నీళ్ళు మల్పనీకి—వచ్చినంక జల్దిరమ్మని యింట్ల జెప్పొచ్చిన" కావలిశెంద్రయ్య.

"నీళ్ళు మల్పనీకి వోయిండా? ఎపనియన్న పీకనీకిపోయిండా ? ... ఏం

85

పంతులు ఇయ్యాల పంచాదున్నదంటివి—సప్పుడుజెయ్యక గూసుంటివి ఇట్లయితేఎట్ల నిన్న మొన్న శెప్పం పొద్దు ఆ బేకూప్ గాన్కి"—పటేల్.

"శెప్పంపినామయ్యా—ఆడు యాదిమరుపులోడు—ఎట్లిన్నడో, ఏమి జేశిండో తెల్వదు—మీదిమోగపోడు ఆడు-కావలి బాలిగాణ్ణి నిన్న రెండుమాట్ల తోలిచ్చిన రెండు మాట్లు గలువలేదంట—యేడికి పోతుండో ఏమో ఎత్కతిసతందుకు—ఒక్కొక్కనికి కావరాలెక్కినయ్—కావలోన్కి గూడ కల్వకుంట అయింద్రు" కరణం పంతులు—

"వాడెందు కొస్తడయ్యో వాడు తానేషైయిండు. దొరవాడు. దొరైయిండు. వాని కొడుకేమో లీడరైయిండు—వాడేమొ దొరైతుండు ఇగవాడెందుకొస్తడు—ఒక్కొక్కనికి తిండెక్కువయితుంది—యిగయేడికెలిపస్తర్-తిండిలేక మలమలమాడుతుంటే కొడుకుల కావరాలు వొంగి అయ్యా సీబాంచన్ అంటరు—ఇప్పదేడ—మదం మీదున్నరు మాదిగోల్లు..."—పటేలు శిర్రుబుర్రులాడుకుంట అన్నడు—

"రాకుంటే యేడికి వోతరు-పట్టుకొచ్చి వొంగవెట్టి ముడ్డిమీదికలి నాల్గు తల్గిస్తే గప్పుడు శెప్పినట్టింటరు—మల్లొసారి పిలువంగనే ఉరుకొస్తరు—గవి లేకనే శిన్నవోయింద్రుకొడుకులు—శానరోజులైయింది గదా ఎవణ్ణి సుదురాంచక గందుకనే పెయిలు ముల, ములాంటున్నయ్..." కరణంపంతులు మాదిగోళ్ళ మీదున్న కసంత తిట్లతోటి తీర్చుకుంటుండు--

కావలి శెంద్రయ్య దిక్కులు సూసుకుంట గట్లనే నిలవడ్డడు-

ఆడ కూసున్న ఆసాములు, సావుకార్లు పటేలు, పంతులు దిక్కేసూసుకుంట తమ ముచ్చటేందో మాట్లాడుకుంటుండ్రు— "బియ్యంధర ఎక్కినయంట గదా గంజిల" అని— "ఆందాలు ఎన్ని సంచుతైనయ్' అని— "గడ్డకిందిమైసిగాడు నాకు ఇంకా ఒడ్లు గొలుస్తలేడ"ని— "రేషన్ మీద శెక్కరియ్యకుంటే సాకలోడు శాన శాన ఎగిరిండు" అని "మొన్న మంగలోడు గడ్డంగీకురా అంటే పెండ్లికి పోతున్నా అని తోక పీకిండ"ని "కొనింటి పోశిగాని కోడలు శాన వుశారుంద"ని గిట్ల మాట్లాడు కుంటుంద్రు—.

మాదిగ దుర్గడు ఇంక రాలేదని పటేలు కోపంల వున్నడు— జర గరాన్కి వొచ్చిండు--గులుగుతా వుండు-వాడు రాకపోయెనని—

ఆడ కూసున్నోళ్ళంత జెరసప్పుడు జెయ్యక కూసుంద్రు-కావలిశెంద్రయ్య అట్లనే నిలవడ్డడు పక్కకు—పటేలు దిక్కు బయం బయంగ జూస్కుంట—

కరణం పంతుల్కి చైన్ పడ్తలేదు—దమాకంత కరాబయింది. ఏమేమో అనుకున్నడు—ఏమేమో శెయ్యాలనుకున్నడు—కని ఏమిసమజ్ ఐతలేదు. దమాకంత గిర్రున తిరుగుతుంది—

యెంకట్రామిరెడ్డి పటేల్కైతె యేమి తోస్తలేదు— యెవన్ని తిట్టాల్నో

86

యెవన్ని కొట్టాల్నో తెలుస్తలేదు. నోట్లె నోట్లనే తిట్టుకుంట జేబులకెలి శిగిలేటు డబ్బ దీసి శిగిలేటు ముట్టించిండు–

గట్టిగ ఓ దమ్ముగుంజి "ఒరే శంద్రిగా మాదిగ దుర్గడు యేడేడ వుంటడో సూసినావురా? ఆ కల్లుదుకాండ్ల... అడాడ సూసిరాపో!"

"సూసొచ్చిన పటేలా, అదంత సూశే యింటికిబోయిన యింటికాడాలేడు–యింట్లలేకుంటెనే పోశికి శెప్పొచ్చిన–వొస్తే జల్దిన పంచాదాఫీసు కాడికి రమ్మని" యేడ రంజిగ మాట్లాడితే తంతడేమోనని మెల్లగ జెప్పిండు శంద్రియ్య–.

యెంకట్రామిరెడ్డి పటేలు జరకండ్లు పెద్దగజేసి శెంద్రిగాన్ని ఒక గడియ సూసి "పోశియెవతిరా?" అని కండ్లు మిట్కరిచ్చి అండు.

"శెప్పాల్నా ?వొద్దా ? శెప్పాల్నా ? వొద్దా ? శెప్తె ఏమని శెప్పాలె" అని శెంద్రిగాడు మనసులనే అనుకొని, జరసేపు తత్తర బిత్తరపడి "దుర్గనిపెండ్లామే పటేలా" అని అన్నడు.

"ఆఁ...లంజముండను గూడ రమ్మనొద్దురా ? పంచాదికాడికి–దాని కొడుకు జేసిన లెక్కల్ యింటుండే...కుక్కను కిన్నట్టు కనిపారెయ్యంగనే అయిపోయిందంటనా? దాని తల్లీ..." పటేలు శెడ్డ శెడ్డ మాటలు తిట్టిండు–

శంద్రిగాడు నీళ్ళు మింగుకుంట సప్పుడు జెయ్యకుంట నిలబడ్డడు.

"కావరంబట్టి, మదమెక్కి ఎనిమిది మందిని, తొమ్మిది మందిని కని పెంట మీద పారేశినట్టు పారేస్తరే లంజలు–ఊరి మీద బలాదూర్‌గ తిర్గుతరు పెద్దగైనంక–అకరా ఫికరా తినేయాళ్ళకు ఇంత ముంగటికొస్తే సాలాయె–పొద్మీకితే ఇంత యేసుకుంటే సాలాయె లంజకొడుకులకు..." అని యెంకట్రామిరెడ్డి పటేలు నోట్లె నోట్లె తిట్టిండు–

శంద్రయ్య మనుసు కష్టమైంది– "ఇంత కుక్కలెక్క ఎన్నేశినా యేదో ఒక వంక బెట్టనే వుంటడు పటేలు" అని "ముందేమో దుర్గనికి శెప్పిరమ్మని జెప్పి యిప్పుడేమో పోశిని రమ్మనొద్దా ?" అన్నందుకు శంద్రయ్య మనుసు యేదోతీర్గ అయింది–తప్పు జెయ్యకున్న పధిమందిల తప్పు జేశిండు అంటే ఎంత కష్టమనిపిస్తదో మనిషికి శంద్రయ్యకు గూడ గంత కష్టమనిపిచ్చింది–ముండ్లమీద నిలబడ్డట్టు నిలబడ్డడు శంద్రయ్య పటేల్, కరణాల ముంగల–ఇంగలాల మీద నిలబడ్డట్టు నిలబడి కదుల్తె ఏమంటరో అని కదులకుండ మనసును చంపుకోని నిలవడ్డడు–

యెంకట్రామిరెడ్డి పటేలు గులుగుకుంటనే కాయిదాలు సూస్తుండు–

సావుకార్లు, ఆసాములు యెంకట్రామిరెడ్డి పటేలు మాట్లాడినంతసేపు చప్పుడు జెయ్యక గప్‌చుప్‌న వుండి పటేల్ నోటిమాట ఆగిపోంగనే ఆళ్ళ మాటలు అళ్ళ మాట్లాడుకుంటుండ్రు–

87

ఇగ కరణం పంతులు అన్ని దికుల సూసుకుంట జంధ్యం తోటి ఈపు గోక్కుండు, ముఖమంతరిల్లిచ్చి–

నోట్లెవున్న ఊము పక్కకుంచి శెల్లతోటి మూతి తుడ్సుకోని "శంద్రిగా! వాని కొడుకు గిట్ల కనబడ్డాడురా గుడిశెల" అని అడిగిండు పంతులు

శెంద్రయ్య పంతులు దిక్కు సూపులు మల్పి "లేదు పంతులు కన్పియ లేదు..." అని మెల్లగన్నడు–

పంతులు పాణం జెర సల్లబడ్డట్టయింది–ఎందుకో ఏమో మొఖం మీద జెర తెలివి కన్పిచ్చింది–తను అనుకున్నది అయినందుకు ఎవ్వల్కి తెల్వకుంట పండ్లు బయటపెట్టి ముసి ముసిగ నవ్వుకుండు–

మాదిగ దుర్గని కొడుకు సాయిలు ఊర్లె వుంటె పంచాదు తక్వ కాదనే అడు లేనప్పుడు సూశే పంచాది పెట్టిండు పంతులు–

అసాములు, సావుకార్లు ఆడకూసోని శానసేపయింది–ఒక్కొక్కర్కి యాస్టొస్తుంది–అయిాలు తీసుకుంట, బొర్రలు నిమ్రుకుంట, శిటికెలేసుకుంట మనస్సంత యెటో పెట్టి ఒట్టి శత్తను పంచాదాఫీసుకాడ పెట్టిండ్రు–ఏమి జెయ్యాల్నో యెవర్కి తెలుస్తలేదు–ఆడికెలి యెల్లిపోతే యెంకట్రామిరెడ్డి పటేల్ ఏమంటడో అని భయం.. నెత్తిగోక్కుంట పెయ్యిగోక్కుంట శిర్రెత్తినట్టుంది అందర్కి. ఆ శిర్రెవరి మీద తీయాలో తెలుస్తలేదు. "ఎందుకొచ్చినంరా పని యిడ్శి పెట్టుకుని'' అని అను కుంటోళ్ళు అనుకుంటనేవున్నరు–

పొద్దుబాగనే అయింది - ఎండ నెత్తిమీద కొస్తుంది. మాదిగ దుర్గడు యింక రాలేదు. యెంకట్రామిరెడ్డి పటేల్ గడియాల్ జూసుకుండు. పండ్లు "పట పట" మన్నయ్- మొఖమంత యెర్రగయింది- ఇజ్జత్ పోయినట్టయింది- మన్సు పాడై యింది- శిగిలేటు దమ్ము గట్టిగ గుంజి పొగ గాలిలకు యిడిశిండు, గాపొగ అయ్న మొఖం మీదనే తిర్గుతుంది- శేత్తోటి అటు ఇటు అండు-

కావలి శంద్రయ్యకు ఎటు తోస్తలేదు– పంచాదాఫీసు గోడదిక్కు జర్గి నిల వడ్డడు– శంద్రిగాని మన్సుగూడ బాగలేదు. శంద్రయ్య దమాకంత ఫికర్లతోటి నిండిపోయింది– కావలి కట్టె మీద గదుపపెట్టి జండకాడ శీమలన్ని గల్సి ఏమో పీక్కతింటుంటె గటుదిక్కు సూస్తుండు– టీరిపోయినట్టు గటే సూస్తుండు– శీమల సూస్తుంటే గటే సూడబుద్దయింది శంద్రయ్యకు–ఏమేమో సోంచి జేసుకుంట యెర్రి పట్టి సూస్తుండు–...యెంకట్రామిరెడ్డి పటేలు నోరు సప్పుడు యినరాంగనే గజ్జున వణ్కి బెదురుకుంట, బెదురుకుంట పటేలు ముంగటి కొచ్చిండు–

యెంకట్రామిరెడ్డి పటేలు నోట్లె శిగిలేటు తీసి బయటకు పారేశి ఒక్కసారి తుపుక్కున ఊంచి శంద్రయ్యను పిలిశి–

"ఒరే శంద్రిగా... ఆ దుర్గని దగ్గర్కి వోయి వస్తడో రాడో అర్సుకరాపో– లేకుంటే పోలీసు ఠాణకు పట్టియ్యమంటడో అడుగు– రోజు రోజుకు దిమాకులు

ఎక్కువై తున్నయ్ లంజకొడుకులకు— యేలెడంతలేని లంజకొడుకులకు ఎయ్యేన్గుల బలమొస్తుంది— యేడికెలొస్తుందో తెలుస్తలేదు కొడుకులకు......"

శంద్రయ్య తల్కాయ వూపుకుంట ఆడికేలి కదిలిండు— శంద్రయ్య ఆడి నుంచి కదిలినంక గూడా పటేలు తిడ్తావుండు...

"యెత్కతినే లంజకొడుకులకు ఏమి పొగరొచ్చినా వొచ్చింది— కంటికి కన బడకుంట అయింద్రు కొడుకులు— గంజి గట్కపోయి ఇంత బువ్వతిన నేర్శింద్రేమో ఒక్కొక్కని కండ్లు నెత్తిమీది కెక్కినయ్ — బలుపెక్కింది ఒక్కొక్కనికి—కావరం వొంగే యెట్టికొట్టం లేకపాయే... యెవడు శేతుల లేకుంట అయింద్రు యిగయేడికేలి ముంగల పడ్తం..." అని—

"ఏమయ్యా పంతులు...... గిట్లైతే ఎట్ల? ఎంతసేపు కూసుందాం ఈడ? నీ లెక్కఏందో? నీ కథ ఏందో? నాకెం అర్ధమయితలేదు— ఎద్గ అన్యాయమై పోయింది..." కరణం పంతుల్ని సూసుకుంట అన్నడు పటేలు.

కరణం పంతులు సూపులు జెరసేపు ఆగమాగమైనయ్.

"నేనేం జెయ్యాల్నయ్యా, నేనేమిజెయ్యాల్నో జేస్త— ఎన్ని తీర్ల జెయ్యాల్నో అన్ని తీర్లచేస్న— వానింటికి రెండు రోజులసుండి కావలోన్ని పంపియ్యనేబడ్తి— నీ కండ్లముంగటనే రెండుసార్లు పోయినా కలువలేదని వచ్చే కావలోడు— రెండు దినాలసంది గిదే ఏశం. 'ఈడ ముస్గుతడు ఆడ తేల్తడు' అన్న ఏశమయింది. ఇగ నేనేమి జెయ్యాలె — గింత మగర కెగబడ్డరు మాదిగముండకొడుకులు యిగ యేడి కేలి ఐతది— ఒక్కడన్న శేతులలేడు— ఎవని రాజ్యం ఆనిదై సట్టయింది..."

అని కరణం పంతులు తొవ్వలు సూస్తుండు— దుర్గడుగిట్ల వస్తుండేమోనని కండ్లద్దాలల్లకేలి పరీక్షగ సూసిండు— సూస్తే అటు కేలి సాకలోడు బట్టలమూట ఎత్తుకోని పోతుండు, కాని దుర్గడు కనబడలేదు.

పంతులుకు అరికాలిమంట నెత్తికెక్కింది—గంత కోపమొస్తుంది. కాని యేమి జేయజాల్త లేడు— యేమి జెయ్యాల్నో దెలుస్తలేదు. దమాకంత యిదిగా తయా రయింది— నెత్తి పల్గిపోయేటట్టు సోంచిజేస్తుండు కాని యేమి అర్ధమయిత లేదు— యెటూ తోస్తలేదు— నోట్లె, నోట్లె ఏమేమో తిడుతావుండు— గాతిట్లు ఆయనకే దెలుస్తలేవు ఏమి తిడుతుండో—

సావుకార్లు, ఆసాములు యిరకాటంల వడ్డట్టు యెటుబోకుంట ఆడనే కట్టేసినట్టు కూసున్నరు. మాటలుకూడ మాట్లాడ్తలేరు— సప్పుడు జెయ్యక కూసుండ్రు— యెవరి సోంచిల ఆళ్ళున్నరు—

యెంకట్రామిరెడ్డి పటేల్ ముంగట పచ్చిగడ్డి ఏశినా 'బగ్గున' మండేటట్టుంది. గంత కోపంల వున్నడు. గా కోపంలనే శిగిలెట్ దీసి అగ్గిపుల్ల గీరి శిగిలెట్ ముట్టించిండు— అగ్గిపుల్ల అంతదూరాన యిశిరి పారేసిండు— గట్టిగ ఒక్క దమ్ముగుంజి పొగ గాలిలకు యిడిశిండు—గాపొగ ఆడనే వుంది— ఆడనే తిర్గుతుంది— పొగ కండ్ల

శ్శకు పోతుంటే చెయ్యితోటి అటు, ఇటు అన్నడు– పొగ జెర దూరం బోయింది. పొగను శెయ్యితోటి అటు, ఇటు అంటుంటే సూపు తొవ్వమీద వడ్డది– జెర్రదూరం శేలి దుర్గడు, కావలి శంద్రయ్య వస్తున్నరు–

మాదిగ దుర్గని సూడంగనే పటేలు పండ్లు పట, పట మన్నయ్. కండ్లు ఉరిమి ఉరిమి జూసినయ్– గుండెకాయ బుస్సున పొంగింది– శేతులున్న శిగిరేటు పెదవుల సందున నలిగింది.

మాదిగ దుర్గయ్య, కావలి శంద్రయ్య పంచాదాఫీసు కాడికొచ్చింన్రు.

కావలి శంద్రయ్య పీర్ల కొట్టం దిక్కు జరిగి నిలబడ్డడు – మాధిగ దుర్గడు రెండు శేతులు జోడిచ్చి వొంగొంగి "దండాలు దొర! దండాలు" అన్నడు - గట్ల వొంగినప్పుడు శేతులు కడుపుల కొచ్చినయ్ - యెంకట్రామిరెడ్డి పటేల్ దుర్గని మింగేసెటట్టు సూస్తుండు–

దుర్గయ్య మాత్రం పటేల్ కండ్లల్లకు సూస్తలేడు – ఎదో బుగులు బుగులు తోటి సావుకార్లు, ఆసాముల దిక్కు సూస్తుండు ... అంతట కలియ జూస్తుండు– కరణం పంతులు దిక్కు సూసి "దండాలు పంతులు" అని అన్నడు–

కరణం పతులు ఉరిమురిమి సూసుకుంట

"దండాలే పాణగండంరో –దండాలు బాగనే వున్నయ్ గని..."

దుర్గయ్య గొంతు యెండిపోయి నట్టయింది కరణం సూపులకు మాటలకు– నోట్లవున్న వూము ఒక గుటక మింగి, రెండుశేతులు జోడిచ్చి, కండ్లళ్ళ నీళ్ళు నింపుకుని వనుకుతున్న పెదువులతోటి

"గట్లంటవేమి పంతులు – మీగులాపోల్లం – ఎన్నడులేంది శిత్రంగ మాట్లాడ వస్తిరి..."

కరణం పంతులు యెంకట్రామిరెడ్డి దిక్కు తిర్గిండు – యెంకట్రామిరెడ్డి దుర్గయ్యను నమిలేశెట్టు సూస్తుండు – సావుకార్లు, ఆసాములు ఈ ముగ్గుర్ని సూస్తూవున్నరు–

పటేల్‌ను సూసుకుంట పంతులు

"అగ సూడయ్యో! గులాపోడంట ఈ మాదిగ ముండకొడుకు" అన్నంగనే పటేలు పంతుల్ని మింగేశెటట్టు సూసిండు – గట్ల సూడంగనే పంతులు దుర్గయ్య దిక్కు తిర్గి

"అరే మాదిగ ముండకొడుకా ఎవన్కిరా నువ్ గాయిది పనిజేశింది? ఎవన్కిరా నువ్ యెట్టిపని జేశింది? ఎవన్కిరా నువ్ బాంచ పనిజేశింది?" అని గదిరిచ్చిండు–

దుర్గయ్య నోట్లె వూరిన నీళ్ళు మింగి మెల్లగ

"గిప్పుడు జెర గాయిదు పని, బాంచపని దప్పిందిగాని నా శిన్నతనంల మేం శెయ్యకుంటె యెవరు జేసింన్రు పంతులు ... అంటే కోపాన్కి వొస్తరు గాని..."

పంతులుకు అగ్గిమీద గుగ్గిలం ఏశినట్టయింది.

"గప్పటి మాట యెవన్కి గావాల్రా, గిప్పటి మాట మాట్లాడు..."

యెంకట్రామిరెడ్డి పటేలు పని తెగిన శెఱువు లెక్కయింది – పంతులు మీద, దుర్గయ్యమీద పట్టరాని కోపమొచ్చింది–

"ఏందయ్యా, ఏ మాట్లాడ్తున్నవ్ అనితోటి – నువ్ మాట్లాడ్తున్నకొద్ది ఆడు నెత్తిల ఎక్కుతున్నడు – గిప్పుడు గవన్ని యిడ్శిపెట్టు – ఇయ్యాల్టి సంగతేందొ, ముచ్చటేందో దబ్బునగానియ్యి – ఏదో వైనంజేస్తున్న వేంటిదయ్యా – అనితోని వొర్లుకుంట కూసుంటె మన పనులైనట్టే – ఆళ్ళ పని తర్వాత జేస్తనుగాని ఇయ్యాలటి ముచ్చటేందో గానియ్యి..." పంతులును సూసుకుంట అన్నడు–

పటేలు గట్ల అనంగనే మాదిగ దుర్గయ్య గజ్జున వణికిండు – ఆసాములు, సావుకార్లు – కావలోళ్ళు బిత్తరవోయి సూస్తుండ్రు–

దుర్గయ్య ఇంక జెరముంగటికి వొచ్చి రెండుశేతులు జోడిచ్చి – పటేలు కూసున్న కాళ్ళకాడ మొక్కి–

"మీకు దండం బెత్తదొర, గంత కోపాన్కి రాకుండ్రి – గాయిదు పని జేసుకుని బతికెటోళ్ళం – గరీబుగాళ్ళం మామీద దయవుంచుండ్రి – మీరు తొక్కుకుంటబోతే మీ కాళ్ళ దుమ్మొంబడి వొచ్చెటోళ్ళం – జెర కన్ను ఒంకర బెట్టి సూడకుండ్రి దొర – మీ గులాపోల్లం..." అన్నడు.

"ఈ నక్కజిత్తుల మాటలు యెన్కసీరికి గని ముందుగాల్ల గీ పంచాదెందో తెగనీ..." పటేల్ అన్నడు–

"సరికినా మీరే...సాదినామీరే ... మీగులాపోళ్ళం – దండం బెత్త" అని దుర్గడు మల్లొకసారి పటేల్ కాళ్ళకు మొక్కిండు –

"ఎవణ్ణి ఎవడు సర్కుతడొ – ఎవన్ని ఎవడు సాదుతడో ఎవన్కి ఎర్కగాని... ముందుగాళ్ళ ఈ సంగతి గానియ్ –" పటేలు

"ఏ సంగతి దొర నీ బాంచన్..." దుర్గయ్య

"ఈడ పంచాదెందుకు పెట్టిండ్రనుకున్నవ్‌రా ... తిన్నదర్గక పెట్టిండ్రనుకున్నవా?..."

"గట్లంటనా నీ గులాపోణ్ణి"

"నీ కొడుకేదో సంఘం బెట్టిండంటగదరా? ఊర్లె ఉండ బుద్ధయితుందాలేదా? పెయ్యిల ములుగిట్ట మొలుస్తుందా?..."

"వొద్దురా అంటెయినకుంట 'సంగం, సంగం' అని సంఘం బెట్టిండు– నేనాడికి ఎంత జెప్పిన దొర, మనసుంటోళ్ళ కిది లాయకు గాదురా అని బుదగరిచ్చి అదగరిచ్చి జెప్పిన నా మాట శెవుమీధ పెట్టక ఆడు సంఘం బెట్టనే బెట్టిండు..."

"సంఘం బెట్టిండని అందర్కి తెల్సురా—సంఘం బెత్తె ఎట్ల? ఇది ఊరా? పాడా? ఏందన్నట్టు ?—ఊరు కట్టు మీద లేకుంట, నీ కొడుకు బట్కాయించు దామన్కుంటుండు— ఊరు కట్టు దప్పితే ఎవని యిష్ట మొచ్చినట్టు అడు తిర్గితే ఊరే అంటరా ఇది..." పటేలుకు జర్ర కోపం తగ్గింది—

"దొరా నీ గులాపోణ్ణి—నన్ను నీ యెడమకాలి శెప్పు తోటి కొట్టు పడ్త... అనికి శిల్కకు శెప్పినట్టు శెప్పిన దొర—వొద్దురా ఇది తగని పనిరా, తాకులాట పెట్టి తమాష జూస్తరులోకం రేపేదన్న ఆపతి, సంపతి వొస్తే ఉన్నోరోళ్ళు ఆదు కుంటరుగని పొరుగూరోళ్ళు ఆదుకోరురా, ఉన్నూరూళ్ళతోటి కంటు అయితే ఎవడు శేతుల ఉచ్చ బోయడ్రా అని శెప్తి...అయినా ఆని మొండి పట్టు ఆన్దే దొర నీ బాంచన్..." అని మల్లొక సారి దుర్గయ్య పటేల్ కాళ్ళకు మొక్కిండు

"నువు శెప్పినవ్‌రా, శెప్పలేదు అంటలేను—మరి ఊరి కట్టు, ఊరి ఉలుకు సంగతెట్ల? ఊర్లె సాకలోడు, మంగలోడు— బైండ్లోడు, బ్యాగరోడు, కుర్మోడు, కుమ్మరోడు, కావలోడు, నీరడోడు పనిపాటలోళ్ళు అందరుండిరి—ఎవన్ని బత్తె ఆణ్ణి బట్కాంచి అది జెప్పి ఇది జెప్పి ఊర్లెవేమన్న జర్గితే ఎవని మీద పడ్తదిరా-

దుర్గయ్య నోరెత్తలేదు

"సప్పుడు జెయ్య కండిరా—" యెంకట్రామిరెడ్డి పటేల్—

"ఈడు గిట్లనే అంటడు—ఈడు ఆడబోయి సంఘంల పోరలను జేర్పిస్తడంట ఈడు—నాకు బ్యాగరోడు జెప్పిండు——ఈడు మూతునాకులోడు—ఈణ్ణి నమ్మొద్దు— సూస్తే ఎట్లున్నడు సూడు నల్లికుట్లు—ఏమెర్గనోని లెక్కనే వుంటడు ఎడ్డి కొల్లి గాడు..." అని పంతులు అందుకున్నడు—

నల్గురి ముంగట దుర్గయ్యను కొట్టి పియ్యాలని పంతులు ఇష్టంలవున్నది— పటేలుకు దుర్గయ్యని కొట్టక తిట్టక వొట్టలు పిశికెయ్యాలనుంది—

"నేనే శిన్నప్పట్నుంచి ఎట్లతిర్గిన్నో మీ యందర్కిగుర్తు—ఒగరి కండ్లళ్ళ పండ్లళ్ళ లేకుంట నాపనేందో జూసుకుంట—వున్ననాడుతిని లేనినాడు కడుపులకు కాళ్ళు ముడ్సుకొని పండుకున్న—ఒగని జోలికి పోయేటోణ్ణి గాదు—ఒగని అంటు, సంటుకు తిర్గెటోణ్ణిగాదు—సచ్చెయ్యాలకు గిప్పుడు నిందమోపితే ఎట్ల పంతులు...?

పంతులు దిక్కుసూసుకుంట అన్నడు దుర్గయ్య—

దుర్గయ్య బుజం మీదున్న గొంగడి జారిపోతుంటె సరింగ ఏసుకుని నెత్తి కున్న రుమాళ్ళ 'కరకు' సుట్ట వున్నదోలేదో శెయ్యితోటి సూసుకుని నిలవడ్డడు.

పంతులు, పటేలు సావుకార్లు ఆసాములు కూసున్నరు—

ఎండకు దుర్గయ్య రెట్టకున్న యెండి కడెం మెరుస్తున్నది. యేలికున్న రాగివుంగరం 'మండుతున్నది'—ఎండల నిలబడ్డడు—

"శెడు కాలంల దుర్బుద్దులు రాకుంటే ఏం జేస్తయిరా" పంతులు

"పంతులూ నీ కాల్మొక్త—గట్ల మాటలని నన్ను జంపకు—"దుర్గయ్య

92

"ఏందిరో మాటలనంగనే సస్తున్నావ్‌రా... ? ''

"నేనిదివరకు ఈపజీత పడలేదు—నాతెరక్లేదు—మీరంటున్న మాటలకు నా కార్జంతూట్లు పడ్తుంది—ఇదివరకు నల్గురిట్ల వొచ్చి మాట్లాడినోన్నిగాను—పంచాదులల్ల తిర్గినోన్నిగాను – నీ కాల్మొక్త, దండంబెట్త..."

"అరే... కాళ్ళు మొక్కుడు యెక్కసీరికి గని – ముందుగాళ్ళ నీ కొడుకు సాయిలుగాణ్ణి ఆ సంఘం బంద్ జెయ్యిమను..." పటేలు

"శెప్త దొర – నీ కాల్మొక్త"

"మల్ల కాల్మొక్తనంటవేమిరా – రేపు మాపట్కల్ల సంఘం గింఘం సప్పుడు ఏమినిపియ్యొద్దు – ఇన్పిచ్చిందో – ఇగ నేనేంజెయ్య పోలీసుకు పట్టిస్త – పోలీసుకు పట్టించినంక ఏమైన అయితే నాకు దెల్వదు..."

'పోలీసు' అన్నంగనే దుర్గయ్య కడుపుల బుగులయింది – కుతికె ఎండుక పోయింది కాళ్ళు వొణికినయ్. గొంగడి జారింది – పెదుగులు వొణికినయ్ – ఎంటనే మాటరాలేదు.

"పోలీసుకు గిట్ల పట్టియ్యకుండ్రి నీ కాల్మొక్త – నీ గులాపోణ్ణి. ఆడు శిన్న పోరడు తెలిసో, తెలియకో జేశిండు – అన్కి నేనే సచ్చుజెప్పుత – ఎన్క ముందు లేనోళ్ళం – పచ్చులోతె బతుకుతున్నం. దొరా మీ కాల్మొక్త..." అని దుర్గయ్య, పటేల్ కాళ్ళమీద పడబోయిండు.

పటేలు కాళ్ళు యెన్కకు తీసుకుని "అరే కావలోడ" అనంగనే దుర్గయ్య యెన్కకు జరిగిండు.

"ఆడు శిన్నపోరడా? అరె కావలోడ వీని నోట్లె ఊంచురా – ఆడు శిన్నపోరడారా? ఆడు నిన్ను నన్ను అంగట్ల అమ్మికొస్తడు. నోట్లె ఏలుబెట్టె శీకుతాండ్రా – నీ కొడుకు ఇంకా శిన్నపోరడారా? అగో గోడలమీది రాతలుసూడు ఎట్లున్నయో – శిన్నపోరన్కి గవన్నిఎందుకురా – నిన్ను ముందుతంతె ఆనే సక్కగైతడు – అమీన్‌సాబుకు జెర శెప్పులేస్తినాంటే నీ పని, నీ కొడుకు పని సంఘంల వున్నోళ్ళ పని సక్కగైయితది – సంఘమంటె నువ్ తమాషనుకుంటున్నావురా – జెరంత బలముంటెనే సంఘం బెట్టిండ్రు – శాన బలముంటె ఏమి జేస్తర్‌రా? మంచిమాటకు శెబుతున్న మీ వోణ్ణి సంఘంలకెలి యెల్లిపొమ్మను—ఆడు యెల్లిపోతే సంఘముండది—గింగ ముండది. లేకుంటే శాన తక్లీబుల పడ్తరు – ఎన్కసిరికి పరేశాన్‌ల పడ్తె మంచిగుండది గప్పుడొచ్చి నన్ను ఆదుకోమంటె నాతోటిగాదు—ముందే శెప్పుతున్న నీ యిష్టం—" అని పటేలు దుర్గయ్యకు ఉపదేశమిచ్చిండు—

93

దుర్గయ్య ఆలోశనల వడ్డడు—

కరణం పంతులు తన పెద్దరికం సూపెట్టుకోవాలని

"అరే దుర్గా నీ కొడుకును ఈ గోడలమీది రాతలు మలిపెయ్యమను. ఇయ్యాల రేపట్ల తహసిల్దారు, గిర్దావరు, అమీన్‌సాబ్ వొస్తరంట. ఆళ్ళు సూస్తె బాగుండది–" అన్నడు–

దుర్గయ్య పంతులు దిక్కు తిర్గి

"ఆడు పట్నంబోయి మూడ్రోజులైయింది – రాంగనే మీ దగ్గర్కి తీస్కొస్త పంతులు–..."

"నువ్ తీసుకొస్తే ఆడు రావాలెగదిరా?"

"రాకేం జేస్తడు పంతులు – తోలుకొస్త."

"తోల్కరావుడు గాదు ముందుగాల్ల సంఘం, గింఘం మానుకోమను–అంద్ల వున్నోళ్ళకు గిట్లజెప్పు ఎన్కసీరికి పస్తాన్‌ండ్ల వస్తె మంచిగుండది అవుసుగాని నీ కొడుకు పట్నమెందుకు వోయిండురా అన్కి పాల్టితోటి మిలాకత్‌వుంధా?..."

"ఎమో పంతులు నా కెట్ల ధెలుస్తది నీ కాల్మొక్త"

వాణ్ణి జెర శేతులుంచుకో, పొలంకాడ వొంగబెట్టు – నాగలి, బీగలి దున్నిపిస్తే జెరకష్టమేందో తెలుస్తది. గప్పుడు ఇంట్లనే పడి ఏడుస్తడు–ఊర్లె ఎట్లుండాలె? నల్గురు అవునన్నట్టు వుండాలె-గివేం లంగలెక్కల్‌రా మాకుకొడుకులు లేరా, నీ కొడుకు లెక్క ఊర్లె మీదపడి తిరుగుతున్నార? వూర్లె ఒక్కడే వున్నాడు నీ కొడుకు–పెద్ద మొనగాడై పోయిండు నీ కొడుకు–నాశేతులుంటే నల్లిని నలిపినట్టు నలుస్తుంటి గిసుంటి లెక్కల్ జేస్తే–గంత శేతుల ఉంచుకోకుంటే నీదేంబతుకురా..."

"ఎంత సముదాయించిన పంతులు వానిమాట వానికే... పొలంకాడ యెద్దు లెక్క మగ్గాడుతడు– మల్ల సంఘంపని అని ఆపని, ఈపని అని ఆడికీడికి వోతడు. వొద్దురా అంటె యినడు– "నీకు తెలువదు వూకోవే" అంటడు..."

"వూకోవే అనంగనే వూకుంటావురా శేతులుంచుకోవాణ్ణి. శివరాత్రి లగ్గాలల్ల లగ్గంజెయ్యి అన్క– గప్పుడు జెర సంసారమంటె ఏంటివో తెలిసొస్తది– పెండ్లాం పిల్లలంటె ఏందో ఎర్కయితది–..."

"పెండ్లి జేసుకోరాంటె...నా కెందుకే గిప్పుడు పెండ్లి అంటడు- ఆనితోటి మాట్లాడేది కష్టమయింది– అన్నిటికి అన్డే గెల్వాలె అంటడు..."

"మరి ఎట్లంటవురా ఇప్పుడు?" పటేలు–

"వాడు రాంగనే మీ కాళ్ళదగ్గర్కి తీసుకొస్త పటేలా" –దుర్గయ్య

"తీస్కరాకడ గాదురా, సముదాంచు అన్కి నచ్చజెప్పు ఊరుకట్టు శెడిపోకుండ వుండాలని శెప్పు..."

"గట్లనే సీకాల్మొక్త... జెర కన్ను వొంకరబెట్టి సూడకుండ్రి మీ కాంచెన్– ఏదో తప్పయింది– ఉడుకు రక్తంల పోరడు ఏది జేసిన మనుసులపెట్టుకోకుండ్రి– మీ మీద పంతంగట్టి పెరాయి వూర్లెకు పోయెటట్టున్నమా? మీ దయలేందే బతుకు

తున్నాం పటేలా. కలో, గంజో మీ కాళ్ళకాడ బతుకుకుంట తాగుతున్నం. యిరో ధాలు పెట్టుకోకుండ్రి... తన్నినా దగ్గర్కి తీసినా మీ గులాపోళ్ళమే..."

"గులాపోణ్ణని సువ్వనబట్టివి. కొడుకేమో సంఘంబెట్టవట్టె..."

"తప్పయింది పటేలా— ఆన్కి— సంఘంజోలికి పోవొద్దని జెప్త— ఇంత జెప్పినా పోతాంటే ఆడు నా కొడుకు గాదు— నేను ఆన్కితండ్రినిగాను— నా కడుపుల పుట్టలేదనుకుంట... నా కడుపుల శెడి పుట్టిండనుకుంటా..." అని దుర్గయ్య ఏడిశిండు— కండ్లపొంటి నీళ్ళు దుంకినయ్.

"ఆరే దుర్గా ఈడెందుకు ఏడుస్తవ్... ఏదో తప్పయిందని పటేల్ కాళ్ళు ఆసాములు సావుకార్ల కాళ్ళు మొక్కిపో..." పంతులు.

దుర్గయ్య నిలబడ్డదగ్గరకెలి ముందుకు వొచ్చి పటేలుకాళ్ళు మొక్క వోయిండు— పటేలు కాళ్ళు ఎన్కకు దీసుకుని—"ఈ పాపం ఎవడు గట్టుకోవాలా?" అన్నడు.

ఆసాముల, సావుకార్ల కాళ్ళు మొక్కనీకి ముందుకు నడిశిండు— కొందరు కాల్లు యెన్కకు తీసుకుండ్రు— కొందరు తీస్కోలేదు— యెన్కకు కాళ్ళు తీస్కో నోళ్ళ కాళ్ళు మొక్కి— మల్ల పంచాదాఫీసు ముందట నిలవడ్డడు—

"యిగపో పొయ్యి కొడుకొస్తె సముదాంచుపో" అన్నడు పటేలు.

దుర్గయ్య ఆడికెలి కదిలిండు— మనసంత చెంచలమైయింది.

పంచాదాఫీసు కాడ కూసున్నోళ్ళుగూడ లేశిండ్రు— యెవరి ఇండ్లకు అళ్ళు పోతందుకు పటేల్ అజ్ఞ అడుగుతుండ్రు—

★ ★ ★ ★

దుర్గయ్య గుడిశెకాడి కొచ్చిండు— మనుసుల మనసులేదు. పటేలు మాటలే యాదికొస్తున్నయ్. పోశమ్మ మాట్లాడిచ్చినా మాట్లాడకుంట గుడిశెముందు యాప శెట్టుకింద గొంగడేసుకుని వొరిగిండు.

పోశమ్మ జొన్నలు యిసురుకుంట గుడిశెలనే వుంది.

దుర్గయ్య కునుకుదీసి లేశేయాల్లకు జాముపొద్దుంది. మెల్లగ బుజం మీద గొంగడేసుకుని, సుట్టముట్టిచ్చుకొని పొలందిక్కు పోయిండు—

జెర జెర శీకటి పడుతుంది. సాయిలు గుడిసెకొచ్చిండు. పోశమ్మ జెర సేపు ఏడ్చింది— తల్లిని సముదాయించి కాళ్ల శేతులు కడుక్కోని సాయిలు ఇంట్లనే వున్నడు— పొద్దుగాల జర్గిన పంచాదిని కొడుకుకు శెప్పుతుంది తల్లి— పొలం కాడి కెలి దుర్గయ్య వొచ్చిండు—

దుర్గయ్య రాంగనే గొంగడిమూలకేశి కొడుకును జూసి—

"ఎందుకొచ్చినవ్‌రా సాయిలు— ఆ పట్నంలనే సావనుంటివి— ఆ పార్టీలనే తిర్గనుంటివి. ఇల్లు, ముంగిలి అయ్య, అవ్వ వున్నరని వొచ్చినావ్? అయ్యమ్మ ఏనాడో సచ్చింద్రని అనుకోపో! మాకు కొడుకు పుట్టలేదనుకుంటం పోరా! గిసుంటి ముదనష్ట

పోడు వుండెందుకు – లేకెందుకు– ఉన్ననాడు తింటం– లేనినాడు ముడ్సుకొని పంటం–ఇన్ని రోజులు బత్కలేదా? ఇన్నిరోజుల్నుంచి నువ్వొచ్చిందే తిన్నట్టుంది మేము? నీ యిష్టమున్న జాగలకుపో – నిన్ను అడిగెటోడు ఎవడున్నడు తెగిడిశిన పతంగివైనవ్" అన్నడు.

"అసలేమయిందో జెప్పరాదే– గది జెప్పక ఏదో రామాణ్యం సదువుతున్నవ్– పొద్దుగాల కాపలోడు వొచ్చిండంట ఎందుకు?

"నువ్ జేసిన పనికి కాపలోడొ స్తడు–రేప్‌రేపు తలెముంతలు జార్లపత్తయ్ శిప్పశేతుల వట్టుకుని ఊర్లెత్గి గతి ఐతది

సాయిలుకు తెల్శిపోయింది–సంఘం బెట్టినందుకు ఊర్లె పంచాది వెట్టి వుంట రని–పంచాది వెట్టి ఏం జర్గుతదో సాయిలుకు తెల్సు– అన్ని ఊర్లళ్ళ గిట్లనే జరుగు తుంది–సంఘంబెట్టిన పోరగాళ్ళ అయ్యామ్మలపిల్సి బెదిరిస్తున్నరు అనుకుండు సాయిలు–

కొడుకు మాట్లాడకపోయెటాళ్ళ కల్ల దుర్గయ్యనే

"అరె సాయిలు ఊర్లె వుండనిస్తవా? లేదురా? లేక ఊర్లెకెలి దెంక పొమ్మంటావా? ఇదేంపజీతరా? గాలికి వోయె కంప మెడకు సుట్టుకున్నట్టు–గవన్ని మన కెందుకురా యెన్కముందులేనోళ్ళము మనకు గివన్ని అచ్చిరావు–రేపేమన్న అయితే ఎవడ్రా మన సాద్దారు–సల్లురున్నోళ్ళకు, నాల్గుపైసలున్నోళ్ళకు గట్లజేస్తే నడుస్తది–మనకు నడుస్తదా? గ-జీ, గట్కలేక మనమున్నం–గవన్ని యిడ్శిపెట్టు రంగ రంగాని యింతడిని పొలంకాడ పనిజూసుకుని నీ యిల్లేందో, నీ ముంగిలేందో సూసుకోక సంఘాలు, గింఘాలు మనకెందుకురా" అని అన్నడు–తన మాట ఇంట డేమోనని–

సాయిలు సప్పుడు జెయ్యక యింటుండు – ఇప్పుడేమన్న అంటె యింకా ఎర్రితి పోతారని ఏమనకుంట కూసుండు–మల్ల దుర్గయ్యనే కొడుకుతోటి

"సల్లురితోటి నారాయణ అని వుండక సల్లురికి పట్టిలేని సంగతులు నీ కెందుకురా–సల్లురి కండ్లళ్ళ, పండ్లల్లయెందుకురా మనం? యీడికే అందరు ఆడిపోసు కుంటరు మనమీద–నువ్‌గిట్ల జేస్తే అళ్ళకు యేడికైతది–నవ్వెటోళ్ళ ముంగట జాలిపడట్టు ఐతది–పాలోళ్ళ ముంగట మొఖం గొట్టినట్టు తిర్గక గిదేం లెక్కల్‌రా?'

సాయిలు మాట్లాడలేదు–పట్నంకెలి తెచ్చిన పుస్తకాలు దీపం యెల్గుకు కన్నులు నులిపి సూస్తుండు–పోశమ్మ పొయ్యికాడ బువ్వ వొండుకుంట ఆళ్ళ మాటలన్ని యింటుంది–మల్ల దుర్గయ్య కొడుకుతోటి

"మన కాన్దాండ్ల ఎవరైన వున్నార్రాగిట్ల – గిప్పుడు నువ్వొక్కనివి లేశి నవ్‌రా–అయినగాని నువ్ఒక్కనివి తండ్లాడితే మంచిగైతాదిరా లోకం? వొద్దు బిడ్డా సాయిలు మనకవన్ని వొద్దు – ఏదో ఉన్నదో లేందో నిమ్మలంగ తిని ఇట్లవుండు –

96

గా పుస్తకాలు గిస్తకాలు తీసి అవతల పారెయ్ పొద్దుగాల్ల ఆ పంచాదికాడ పటేల్, పంతులు ఒక్కొక్క మాటంటుంటే నా కాల్జంతూట్లు పడ్డది – గివన్ని మానుకో బిడ్డ సాయిలు" అని కూసున్న దగ్గరికెలి లేశి సాయిలు దెగ్గర్కి వొచ్చి బయటపారే ద్దామని పుస్తకాలు శేతుల పట్టుకుండు–

తండ్రి శేతులకెలి పుస్తకాలు తీస్కొని సాయిలు

"నీకు తెల్వదే అయ్యా – పటేల్, కరణాలు గట్ల అనకుంటే ఇంకెట్ల అంటరు? వాళ్ళకు నూర్ల ఎకరాల భూముంది. మన లేనోళ్ళకు పనిపాట లోళ్ళకు సాపంత భూమిలేకపాయె. అళ్ళ భూములల్ల మనోళ్ళే మర్లాడాలే. గట్లమర్లాడినా గంజి కుండది, కుండ కుండది. నువ్ జూస్తున్నవ్ గదనే... దున్నెటోనిదే భూమి కావాలని శాలమంది కొట్లాడుతుండ్రు...." అన్నడు.

దుర్గయ్య సాయిలు కండ్లల్లకు సూసిండు.

"ఇగో గీ పుస్తకంల వున్నోళ్ళందరూ గిసుంటి కొట్లాటల్లనే సచ్చి పోయిండ్రు" అని ఓ పుస్తకం సూపెట్టిండు.

"గీయన 'కృష్ణమూర్తి' గీమె 'నిర్మల' ఈళ్ళుగూడ సచ్చిండ్రు పెద్ద పెద్దోళ్ల కొట్లాడంగ మనమేందే... ఇయ్యాల వుంటం రేపుసస్తం... ఆ సచ్చే దేదో మంచి పన్కి సస్తే మంచిగుంటది..."

దుర్గయ్య సాయిలు సూపెట్టిన బొమ్మలు సూసిండు... జెరశేపు ఆలోశన జేశిండు. ఇగ వీడు తన మాట యినడనుకోని ఒక్కసారి సాయిలు నెత్కి కిందికి మీదికెలి సూశి సర్రసర్ర గుడిశె బయట కొచ్చిండు.

పోశమ్మ గల్మకాడ నిలవడి సూస్తున్నది.

సాయిలు అక్కడిక్కడ పడ్డ కాయిదాలు, పుస్తకాలు సదిరి - తనశేతులున్న 'నిర్మల కృష్ణమూర్తి' బొమ్మలున్న పుస్తకాన్ని కూడ బల్కకుంట సదువుతావుండు దీపం ముంగట. ఇయ్యాలగాకున్న రేపన్న తన అయ్య తనపని మంచిదే అంటడన్న బరోసతో.

విరసం సాహిత్య మాస పత్రిక

అరుణతార

చందాదారులుగా చేరండి—చేర్పించండి

సంవత్సరచందా రూ. 15

ప్రతులకు : సి. యస్. ఆర్. ప్రసాద్

సి—108, శ్రీనివాసనగర్ కాలనీ,

గుంటూరు

97